# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | శుక్రవారం 11 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 124

తెలుగు దినపత్రిక




# పోయిరా మాయమ్మా..

## ఘనంగా సద్దుల బతుకమ్మ

ఆడిపాడిన ఆడపడుచులు..
రాష్ట్రమంతా మార్మోగిన పల్లె సంస్కృతి..
ముగిసిన తొమ్మిది రోజుల సంబురం
ట్యాంక్ బండ్ వేడుకల్లో వేలాది మహిళలు..





4

పూలపండుగ బతుకమ్మ ఘనంగా ముగిసింది. తొమ్మిది రోజులపాటు తీరొక్క పూలతో పూజలందుకున్న గౌరమ్మను సంబురంగా సాగనంపారు. గురువారం సద్దుల బతుకమ్మగా పూజలందుకున్న తల్లిని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసి ఆడపడుచులు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పోయిరా బతుకమ్మా.. మళ్లొచ్చే ఏడాది తిరిగిరావమ్మా.. అని సంతోషంగా వీడ్కోలు పలికారు. బతుకమ్మ సంబురాలతో రాష్ట్రమంతా పల్లె సంస్కృతిని, తెలంగాణ బతుకు జీవితాన్ని మరోమారు గుర్తు చేసుకుని తన్మయత్వం పొందింది.

- జనపదం, కల్చరల్

## చూసుకుందాం రండి..

# కోర్టుకెక్కిన రాజకీయాలు

- నాంపల్లి న్యాయస్థానంలో 320కిపైగా పొలిటికల్ నోటీసులు
- ఇటీవల పెరిగిన లీగల్ వార్
- గతంలో కాంగ్రెస్ కూడా ఇదే వ్యూహం
- మాణిక్ ఠాగూర్‌తో పాటు ఏఐసీసీ నేతలకు కూడా లీగల్ నోటీసులు
- ఇప్పుడూ అదే ట్రెండ్..

జనపదం, బ్యూరో

రాజకీయాలు కోర్టు మెట్లు ఎక్కుతున్నాయి. ఇక్కడా.. అక్కడా.. విమర్శలు కాదు.. వచ్చిన మాటలన్నింటిపైనా లీగల్ వార్కు రెడీ అవుతున్నాయి. "మాటలతోనే మజా ఏముంటుంది. దానిక్కాస్త లీగల్ ఫైట్ టచప్ కూడా ఇస్తే సంవాదం ఇంకా బలంగా ఉంటుంది" అన్నట్టుగా మారింది రాష్ట్ర రాజకీయం. రాష్ట్ర రాజకీయాల్లో లీగల్ నోటీసులతో కొత్త ట్రెండ్ మొదలుపెట్టింది. బీఆర్ఎస్ అగ్రనేతల్లో ఒకరు లీగల్ నోటీస్ అందుకుంటే మరొకరు కాంగ్రెస్ నేతలకు, ప్రజాప్రతినిధులకు లీగల్ నోటీసులు ఇస్తున్నారు. కేవలం మాటలే కాదు అవసరమైతే ......(తరువాయి 3లో)




ప్రజా సమస్యలపై పెగలాల్సిన నోళ్లు పర్సనల్ తిట్లకోసం ఆరాటపడుతున్నాయి. అసెంబ్లీ సాక్షిగా కొట్లాడాల్సిన పెద్దరికాలు, చట్టసభలు చిన్నబోయేలా కోర్టు మెట్లు ఎక్కడానికి ఇష్టపడుతున్నాయి. జనం ఎటు పోతే మాకేంటి.., రాష్ట్రం ఏమైతే పోయేదేంటి.. అనుకుంటున్నారో ఏమోగానీ మేము, మా పార్టీ., ఆస్తుల రక్షణ, మా కుటుంబం అక్కర్లు అన్నట్టుగానే నేతలంతా న్యాయస్థానాల్లోనే తేల్చుకుందామని తహతహలాడుతున్నారు. పరువుల పరువు గంగలో కలుస్తున్నా, మాటలు వినడానికి కూడా సిగ్గుపడాల్సినంత దరిద్రంగా సాగుతున్నా, అడ్డుకట్ట లేయడం వదిలేసి అన్నీ అక్కడే చూసుకుందామని బహిరంగ సవాళ్లు విసురుకుంటూ దాన్నే హీరోయిజం అనుకుంటున్నారు. ప్రజలకు ఉపయోగపడే చట్టాలు పురుడుపోసుకోవాల్సిన పవిత్ర సభలను వదిలి న్యాయదేవతను శరణుకోరుతున్న రాజకీయాలు రాష్ట్రంలో రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నాయి. లీడర్ల వ్యవహారం చూస్తుంటే చట్ట సభ కొంపదీసి న్యాయస్థానానికి షిఫ్ట్ అయ్యిందా..? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

## మంత్రి సురేఖకు కోర్టు నోటీసులు

- పరువునష్టం పిటీషన్ పై నాంపల్లి ప్రత్యేక కోర్టు ఆదేశాలు..
- కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలకు కోర్టును ఆశ్రయించిన నాగార్జున
- విచారణ ఈ నెల 23కు వాయిదా..

4



## సురేఖపై పరువు నష్టం దావా..

- మంత్రి కొండాపై పిటిషన్ వేసిన కేటీఆర్
- సాక్షులుగా బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు

జనపదం, హైదరాబాద్ సిటీ :

నాంపల్లి ప్రత్యేక కోర్టులో మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేశారు. తన ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు



చేసిన మంత్రి కొండా సురేఖపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్ లో కోరారు. ఈ మేరకు ......(తరువాయి 4లో)

# రతన్ టాటాకు కన్నీటి వీడ్కోలు..

- అశ్రునయనాల నడుమ అంతిమ యాత్ర..
- సేవా కార్యక్రమాలు తల్చుకుని విల పించిన జనం..
- నివాళి అర్పించిన ప్రముఖులు..





## ఒకే రోజు 28 చోట్ల..

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలకు నేడు శంకుస్థాపన
- షాద్ నగర్ కొందుర్గ్ లో పాల్గొననున్న సీఎం రేవంత్
- ఏర్పాట్ల పర్యవేక్షణపై కలెక్టర్లతో సీఎస్ సమీక్ష...

జనపదం, హైదరాబాద్ సిటీ:

రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య సౌకర్యాలు అందించే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు శుక్రవారం వివిధ జిల్లాల్లోని 28 ప్రాంతాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన జరగనుంది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్ లో ......(తరువాయి 2లో)



## చెరువుల రక్షణపై అధ్యయనం..

2


- బెంగళూరు విధానంపై స్టడీ..
- చెరువుల పునరుద్ధరణ తీరును పరిశీలించిన హైడ్రా కమిషనర్
- రంగనాథ్ కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించిన లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లగవాడ్

## ఎక్కడోళ్లక్కడ పోండి..

- ఐఏఎస్, ఐపీఎస్ల కేడర్ విభజనపై కేంద్రం ఆదేశం
- అభ్యంతరాలను తోసిపుచ్చిన కేంద్రం
- తెలంగాణ నుంచి రిలీవ్ చేస్తూ డీవోపీటీ ఆదేశాలు
- ఈ నెల 16లోగా రిపోర్ట్ చేయాలి..
- ఏపీలో పని చేస్తున్న ఐఏఎస్ లకు అవే ఆదేశాలు..
- తెలంగాణలో రిపోర్ట్ చేయాలన్న కేంద్రం

4





## ఊరికి బైలెల్లిన నగరం..

- రాజధాని అంతా రద్దీగానే..
- రోడ్లన్నీ ఫుల్ ట్రాఫిక్...
- దసరా ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు..

4



## చట్టం ముందు అంతా సమానమే..

కవిత కేసును కేజ్రీ కోణంలో చూడలేం..
రాజ్యసభ సభ్యులు అభిషేక్ మను సింఘ్వీ
మహిళలకు భరోసా కల్పించాలని పిలుపు..

4



# రతన్ టాటాకు కన్నీటి వీడ్కోలు..

**అశ్రునయనాల నడుమ అంతిమ యాత్ర..**
**సేవా కార్యక్రమాలు తల్చుకుని విలపించిన జనం..**
**నివాళి అర్పించిన ప్రముఖులు..**



**జనపదం, ముంబై:** పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు యావత్భారతావని కన్నీటి వీడ్కోలు పలికింది. మహారాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో రతన్ టాటా అంత్యక్రియలు నిర్వహించారు. ముంబయి వర్లీలోని శ్మశాన వాటికలో అతిరథ మహారథుల సమక్షంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, టాటా గ్రూపు ఉన్నతోద్యోగులు, పారిశ్రామిక వేత్తలు రతన్ టాటాకు తుది వీడ్కోలు పలికారు. కేంద్ర ప్రభుత్వం తరపున కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ రతన్ టాటా అంత్యక్రియల్లో పాల్గొన్నారు

### నివాళుల్పరించిన ప్రముఖులు..

ముంబయిలోని ఎన్‌సీపీఏ గ్రౌండ్ నుంచి వర్లీ శ్మశాన వాటిక వరకు అంతిమ యాత్ర సాగింది. మహనీయుడిని కడసారి చూసేందుకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. రతన్ టాటా అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ప్రజల సందర్శనార్థం గురువారం సాయంత్రం 3:30 గంటల వరకు ఎన్సీపీఏ గ్రౌండ్లో రతన్ టాటా భౌతిక కాయాన్ని ఉంచారు. ఆ సమయంలో ప్రజలతో ప్రముఖులు నివాళులు అర్పించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ రతన్ టాటాకు నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ముంబయి వెళ్లి నివాళులు అర్పించారు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ పారిశ్రామిక దిగ్గజానికి పుష్పాంజలి సమర్పించారు. ఎన్సీపీ శరద్ చంద్ర పవార్ పార్టీ అధినేత శరద్ పవార్ సహా పలువురు నేతలు రతన్ టాటాకు అంజలి ఘటించారు. పారిశ్రామికవేత్తలు సైతం ఎన్సీపీఏ మైదానానికి తరలివచ్చి నివాళులు అర్పించారు. ఆదిత్య బిర్లా గ్రూపు అధినేత కుమార మంగళం బిర్లా రతన్ టాటాకు నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. భారతీయ రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ కూడా రతన్ టాటాకు నివాళులు అర్పించారు.బుధవారం రాత్రి ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచిన రతన్ టాటా భౌతిక కాయాన్ని తొలుత కోలాబాలో ఉన్న ఆయన నివాసానికి తరలించారు. అక్కడ పలువురు ప్రమఖులు, టాటా గ్రూప్ ఉన్నతాధికారులతో సహా మాజీ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ కూడా ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. తర్వాత ముంబయిలోని ఎన్సీపీఏ గ్రౌండ్కు పార్థివ దేహాన్ని తరలించారు. ప్రత్యేకంగా బ్యాం డు, కవాతుతో పోలీసులు ఆయ న్ను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఎన్సీపీఏ గ్రౌండ్‌కు దారితీసే మెరైన్ డ్రైవ్ మార్గాన్ని పోలీసులు మూసివేశారు. అంతేకాకుండా ఆ దారిలో భద్రతా బలగాలను మోహరించారు.



## రాష్ట్రాలకు పనుల వాటా విడుదల

### తెలంగాణకు రూ.3,745కోట్లు

**జనపదం, బ్యూరో:** కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పన్నుల వాటా కింద గురువారం నిధులు విడుదల చేసింది. మొత్తం రూ.1,78,173కోట్లు విడుదల చేసినట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ నిధులు ఆయా రాష్ట్రాల్లో అభివృద్ధి, మూల ధన వ్యాయానికి ఊతమిస్తాయని కేంద్రం అభిప్రాయపడింది. కేంద్రం ముందస్తు వాటా రూ.89, 086,.50కోట్లతో కలిపి రూ.1,78,173 కోట్లు విడుదల చేసింది. ఇందులో తెలంగాణ రాష్ట పన్నుల వాటా రూపంలో రూ.3,745కోట్లు దక్కనున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.7,211కోట్లు విడదలయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి రూ.31, 962కోట్ల మేరకు కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటాగా కేటాయించింది. ఆ తర్వాత బీహార్ రాష్ట్రానికి రూ.17,921కోట్లు కేటాయించింది. మధ్యప్రదేశ్‌కు రూ.13987కోట్లు, మహారాష్ట్రకు రూ.11255కోట్లు కేటాయించింది. ఒడిశాకు రూ.8068కోట్లు, రాజస్థాన్‌కు రూ.10737కోట్లు కేటాయించింది. తమిళనాడుకు రూ.7268కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ.13404కోట్లు కేటాయించింది. మిగతా రాష్ట్రాలకు కూడా ఆయా రాష్ట్రాల పన్నుల వాటా మేరకు నిధులు కేటాయించింది.

## ఒకే రోజు 28 చోట్ల..

**(మొదటిపేజీ తరువాయి)** జరగనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని పాఠశాల భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ క్రమంలో గురువారం సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండర్గ్ లో సీఎం రేవంత్ రెడ్డి, మధిర నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క యంగ్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవనాలకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. సంబంధిత జిల్లాల్లో జరిగే శంకుస్థాపన కార్యక్రమాలలో మంత్రులు, ఇన్ చార్జ్ మంత్రులు పాల్గొంటారని తెలిపారు. అలాగే ఆయా జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులందరినీ కార్యక్రమాలకు ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. స్కూళ్ల నిర్మాణాలను రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం భూమి లభ్యత ఉన్న ఈ 28 ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ లకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రెండో దశలో ఇతర ప్రాంతాల్లో భూమిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందని సీఎస్ శాంతి కుమారి తెలిపారు.

### శంకుస్థాపన జరిగే 28 నియోజక వర్గాలు ఇవే..

కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్గొండ, హుజూర్‌నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, అంథోల్ చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట్, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్‌నగర్, ప ర్కాల, నారాయణ్ ఖేడ్, దేవరకద్ర, నాగర్ కర్నూల్, మానకొండూర్, నర్సంపేట, నియోజకవర్గాలు ఉన్నాయి.

# రతన్ టాటా కలల ప్రాజెక్టు నానో..



**రూ.లక్ష కారు ఉద్దేశం ఏంటీ..?**
**అసలు ఎందుకు మూతపడినట్టు..**

జనపదం, బిజినెస్: టాటా మోటార్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మార్కెట్‌లోకి తీసుకువచ్చిన టాటా ఇండికా కారు కాస్త నిరాశకు గురిచేసింది. ఆ తర్వాత స్వల్ప మార్పులతో మార్కెట్‌లోకి రీ ఎంట్రీ ఇవ్వగా.. విజయవంతంగా దూసుకుపోయింది. అదే క్రమంలో 2008 జనవరి 10న ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో ఆటో ఎక్స్‌పో జరిగింది. ఇందులో టాటా మోటార్స్ కొత్తగా ఏం తీసుకురాబోతుందనే దానిపై అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. ఎందుకంటే అప్పటికే టాటా మోటార్స్‌కు చెందిన సుమో, సియారా, సఫారీ, ఇండియా మోడల్స్ మార్కెట్‌పై ఆధిపత్యాన్ని చూపుతున్నాయి. అయితే, తొలిసారిగా మధ్యతరగతి కలలను సాకారం చేసేందుకు టాటా సరికొత్త మోడల్‌ను ఆవిష్కరించింది. అదే రతన్ టాటా కలల ప్రాజెక్ట్ అయిన టాటా నానోను ఆవిష్కరించింది. ఈ కారు మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకున్నది. ముంబయిలో ద్విచక్ర వాహనంపై కుటుంబమంతా ద్విచక్ర వాహనంపై వెళ్తుండడంతో చూసిన ఆయన మధ్యతరగతికి అందుబాటులోకి కారు తీసుకురావాలని భావించారు. రతన్ టాటా ప్రకటించిన విధంగానే రూ.లక్షకే విక్రయించనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత చాలామంది మధ్యతరగతి ప్రజలు నానో కారును కొనుగోలు చేశారు. అయితే, బుకింగ్.. డెలివ రీ మధ్య చాలా మారుతూ వచ్చింది. అయితే, టాటా నానోను రూ.లక్షకే మార్కె ట్‌లోకి తీసుకురావడం అంత తేలిగ్గా సాగలేదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది.

### సింగూరు నుంచి సాణంద్‌కు టాటా నానో ప్లాంట్

మొదట టాటా మోటార్స్ పశ్చిమ బెంగాల్‌లోని సింగూరులో నానో ప్లాంట్‌ని నెలకొల్పింది. ఇందుకోసం రైతుల నుంచి భూములను కొనుగోలు చేసింది. ఇక్కడే ఫ్యాక్టరీ ఏర్పాటుతో నానో క్లా తయారీ ప్రక్రియ మొదలైంది. కొద్దిరోజులకే పనులు నిలిచిపోయే పరిస్థితి ఎదురైంది. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న టీఎంసీ అధినేత మమతా బెనర్జీ నేతృత్వంలోని రైతులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. భారీ నిరసనల నేపథ్యంలో సింగూర్ ప్లాంట్‌ని మూసివేస్తున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. ఆ తర్వాత గుజరాత్ సాణంద్‌లో ప్లాంట్ ఏర్పాటుకు భూమిని ఇస్తామని అప్పటి గుజరాత్ సీఎం నరేంద్ర మోదీ ప్రకటించారు. దాంతో సింగూరు నుంచి సాణంద్‌కు ప్లాంట్‌ను తరలించారు. దాదాపు 2వేల కిలోమీటర్ల దూరం వరకు ప్లాంట్‌ను తరలించారు. మొత్తం 3,340 ట్రక్కులు, 495 కంటైనర్లలో ఫ్యాక్టరీని ఏడునెలల సమయంలో తరలించారు. దాదాపు 14 నెలల విరామం అనంతరం మళ్లీ నానో పనులు మొదలయ్యాయి. మార్కెట్‌లోకి వచ్చిన తొలి ఏడాది ఇండియన్ కార్ ఆఫ్ ది ఇయర్ అవార్డును నానో కైవసం చేసుకున్నది. ఈ క్రమంలోనే అంతర్జాతీయ స్థాయిలో అత్యంత చవకైన కారుగా నిలిచింది.

### బుకింగ్స్ పెరగడంతో లక్కీ డ్రా..

రూ.లక్ష కారుకు భారీగా డిమాండ్ ఉన్నది. మధ్యతరగతి ప్రజలంతా కారు కోసం బుకింగ్స్ చేసుకున్నారు. తారా స్థాయికి చేరుకోవడంతో బుకింగ్స్ కోసం సైతం లక్కీ డ్రాలు తయాల్సిన పరిస్థితి మొదలైంది. ఆ తర్వాత కారును రూ.లక్షకే అందివ్వడం కష్టతరంగా మారింది. ఇక ధరలు స్వల్పంగా పెంచాల్సి వచ్చింది. అయితే, రతన్ టాటా రూ.లక్షకే కారు ఇస్తామని ప్రకటించిన నాలుగేళ్ల తర్వాత కారు మార్కెట్‌లోకి వచ్చింది. ఈ క్రమంలో కారు విడిభాగాల ధరలు విపరీతంగా పెరిగాయి. కొంత వరకు నష్టాలను భరించి డెలివరీలు చేసినా.. చివరకు ధరలను పెంచక తప్పలేదు. ఆ తర్వాత అందరూ మారుతి ఆల్టో వైపు దృష్టి సారించారు. అప్పటికే నానోలో చాలా లోపాలు ఉన్నాయంటూ వార్తలు వచ్చాయి. వాటిని సరి చేయడంతో పాటు కొత్త డెలివరీలు చేయడం ఆలస్యమవుతూ వచ్చింది. దాంతో జనాలకు సైతం నానోపై ఆసక్తి తగ్గింది. 2014లో కార్ల సేఫ్టీకి రేటింగ్ ఇచ్చే గ్లోబల్ ఎన్‌సీఏ ఏకంగా నానోకు జీరో రేటింగ్ ఇచ్చింది. ఈ రేటింగ్ నానో భారీగా దెబ్బతీసింది. ఆ తర్వాత బుకింగ్స్ సైతం రద్దయ్యాయి. ఆ తర్వాత రతన్ టాటా నానో ఓ విఫల ప్రయోగమని ప్రకటించారు. కేవలం తక్కువ ధరకే కారును తీసుకురావాలనుకోలేదని.. అందరు మెచ్చేలా ఉండడంతో అందుబాటు ధరలో కారును తీసుకురావాలని భావించామన్నారు. వాస్తవానికి టాటా నానోను ఏడాదికి మూడు లక్షల వరకు విక్రయించాలని టాటా మోటార్స్ భావించింది. కానీ, లక్ష్యం నెరవేరలేదు. చివరకు నష్టాలను భరించలేక.. రతన్ టాటా, సైరస్ మిస్త్రీల వివాదం.. నాయకత్వం మార్పు మధ్య డిసెంబర్ 2019లో నానో ప్రాజెక్టును మూసివేసింది. అయితే, పదేళ్లలో కేవలం మూడులక్షల యూనిట్లను మాత్రమే టాటా విక్రయించింది.

### నానో ఈవీ తెచ్చేందుకు ప్లాన్

ఇటీవల టాటా మోటార్స్ నానోను ఈవీగా తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వచ్చాయి. 2010 జెనీవా మోటార్ షోలోనే నానా ఎలక్ట్రిక్ వేరియంట్‌ను టాటా మోటార్స్ ప్రదర్శించింది. పది సెకన్లలోనే 160 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందుకునేలా సిద్ధం చేసినట్లు పేర్కొంది. ఇప్పటికే 13 సంవత్సరాలు గడిచాయి. కొంతకాలం కిందట రతన్ టాటాను తాజ్ హోటల్‌కు నానో కారులో వెళ్లడం కనిపించింది. దాంతో మళ్లీ నానో ఈవీ వార్తలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ప్రస్తుతం టాటా మోటార్స్ ఈవీ రంగంలో దూసుకుపోతున్నది. టాటా పంచ్, నెక్సన్, టైగర్, టియాగో తదితర ఈవీ కార్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. నానో కారును తీసుకువస్తే డిమాండ్ ఉంటుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

## ఒకే కుటుంబంలో నలుగురికి ఎంబీబీస్ సీట్లు

**అభినందించిన మాజీ మంత్రి హరీశ్ రావు**



**జనపదం, సిద్దిపేట:** సిద్దిపేటకు చెందిన కొంక రామచంద్రం, శారద దంపతుల నలు గురు కుమార్తెలు. వీరంతా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్లు పొం దారు. పెద్ద కుమార్తె మమత 2018లో ఎంబీబీఎస్ సీట్ పొంది చదువు పూర్తి చేసి డాక్టర్ అవ్వగా..రెండో కుమార్తె మాధవి 2020లో ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొంది చదువుతున్నది. ఈ సంవత్సరం మరో ఇద్దరు కుమార్తెలు రోహిణి, రోషిణి ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొందారని, జిల్లా కో మెడికల్ కాలేజీ వచ్చినందుకు ఇది సాధ్యమైందని తండ్రి రామచంద్రం తెలిపా డు. కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పా టు చేయడం వల్ల తెలంగాణ బిడ్డలు ఇక్కడే ఎంబీబీఎస్ చదువుతున్నారని తెలిపారు. ఈ మేరకు రామ చం ద్రం తన కుటుంబ సభ్యులతో కలిసి మాజీ మంత్రి హరీశ్ రావును కలిశారు. నలుగు రు ఎంబీబీఎస్ సీట్లను పొందడం గర్వంగా ఉందని, తల్లిదండ్రుల కలలను సాకారం చేశారని హరీశ్ రావు పిల్లలను అభినందించాడు.

# రిజర్వేషన్ల తర్వాతే స్థానిక పోరు

- **జనవరిలో ఎన్నికలు నిర్వహించే ఛాన్స్**
- **రేవంత్ సర్కార్ కీలక అప్డేట్**




**జనపదం, బ్యూరో:** తెలంగాణలో సర్పంచ్ ఎన్నికల కోసం గ్రామాలన్నీ ఎదురుచూస్తున్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెడీ అయిన నేతలు ఇప్పటికే ప్రజలను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలపై నిర్వహణపై రేవంత్ సర్కార్ కీలక అప్డేట్ ఇచ్చింది. రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ రానున్నట్లు వెల్లడించింది. ఎస్సీ వర్గీకరణ అమలుపై సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించగా.. ఈ మేరకు తీర్పును అమలు చేసేందుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఏకసభ్య కమిషన్‌ను సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ఈ కమిషన్ 60 రోజుల్లోగా నివేదిక సమర్పించేలా చూడాలన్నారు. బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియను సైతం తక్షణమే ప్రారంభించాలన్నారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ, బీసీ సామాజిక, ఆర్థిక కులసర్వేపై బుధవారం సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు.

### ఎస్సీ వర్గీకరణ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్

హరియాణా, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో అమలుకు సంబంధించి అందిన అధ్య యన నివేదికల గురించి సీఎంకు వివరించారు. వర్గీకరణ అమలు, కులాల రీగ్రూపుల ఏర్పాటుపై చర్చించారు. న్యాయపరమైన ఇ బ్బందులకు తావు లేకుండా రిజర్వేషన్లు ఖరారు చేయాలని సీఎం సూచించారు. క్షేత్రస్థాయి నుంచి వినతులు, ఫిర్యాదుల స్వీకరణ కోసం ఉమ్మడి పది జిల్లాల్లో ఏకసభ్య కమిషన్ పర్యటించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. 60 రోజుల్లో సర్వేను పూర్తిచేసి, డిసెంబరు 9లోగా నివేదిక సమర్పించాలని కమిషన్‌ను సీఎం ఆదేశించారు. సర్వే పూర్తయితే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంటే ఈ ఏడాది చివర్ లో, లేదంటే జనవరిలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

**ఇండిగో విమానాల్లో పెట్టామని మెయిల్**
**ఆలస్యంగా వెలుగులోకి..**

**జనపదం, శంషాబాద్:** శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపుతో కలకలం రేగింది. ఇండిగో విమానాల్లో బాంబులు పెట్టామని గుర్తుతెలియని వ్యక్తులు ఎయిర్‌పోర్టు అధికారిక వెబ్‌సైట్‌కు మెయిల్ చేయడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు చెన్నె నుంచి వచ్చే ఇండిగో విమానంతో పాటు ఇతర విమానాల్లో బాంబులు పెట్టామని గుర్తు తెలియని వ్యక్తి మెయిల్ చేశాడు. దీంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యారు. 181 మందితో కోయంబత్తూరు నుంచి చెన్నె వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని అత్యవసరంగా నిలిపివేసి తనిఖీ చేశారు. అలాగే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి చెన్నె వెళ్లాల్సిన మరో మూడు ఇండిగో విమానాల్లోనూ భద్రతా సిబ్బంది సోదాలు చేశారు. వాటిల్లో ఎలాంటి బాంబులు లేకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఇది ఆకతాయిల పనిగా పోలీసులు నిర్ధారించారు.




### మూడు రోజులు వర్షాలు..

**జనపదం, హైదరాబాద్:** రాష్ట్రంలో గడిచిన 24గంటల్లో పలు జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది. అరేబియా సముద్రంలో అల్పపీడన ప్రాంతం నుంచి కర్ణాటక –గోవా తీరం.. కేరళ, తమిళనాడుగా మీదుగా నైరుతి బంగాళాఖాతం వరకు విస్తరించి ఉందని.. సగటు సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని వాతావరణ విభాగం పేర్కొంది. ఈ క్రమంలో రాగల మూడురోజులు తెలంగాణలో వానలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలో వానలుపడే అవకాశాలున్నాయని చెప్పింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# చెరువుల రక్షణపై అధ్యయనం..

- **బెంగళూరు విధానంపై స్టడీ..**
- **చెరువుల పునరుద్ధరణ తీరును పరిశీలించిన హైడ్రా కమిషనర్**
- **రంగనాథ్ కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించిన లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లగవాడ్**



**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** బెంగుళూరులో చెరువుల పునరుద్ధరణ తీరును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. మురుగు నీటి కాలువల నుంచే శుద్ధిచేసే ప్రక్రియను ప్రారంభించి, చెరువుల్లోకి చేరే ముందు నాలుగు దశల్లో నీటిని ఫిల్టర్ చేసేలా హైడ్రా దృషి సారించింది. బెంగళూరుకు వెళ్ళి క్షేత్ర స్థాయిలో చెరువుల పునరుద్ధరణను పరిశీలించాలనే యోచనలో హైడ్రా ఉంది. ఈ నేపథ్యంలో బెంగళూరులో ఏర్పాటు చేసిన విధానంపై హైడ్రా అధ్యయనానికి హైడ్రా శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ నుంచి బెంగళూరులో ఉన్న లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లగవాడ్ తో వీడియో కాన్ఫరెన్స్ ను రంగనాథ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగుళూర్ నగరంలో మురుగునీటితో ఉన్న చెరువులను మంచినీటి చెరువులుగా ఎలా మార్చారో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆనంద్ మల్లగవాడ్ వివరించారు.

### 35 చెరువుల శుద్ధీకరణపై వివరణ..

బెంగుళూరులో మొత్తం 35 చెరువులను పునరుద్ధరించిన విధానాన్ని తెలిపారు. తక్కువ ఖర్చుతో చెరువుల పునరుద్ధరణ, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించిన విధానం, చెరువుల్లోకి స్వచ్ఛమైన నీరు చేరేలా చేసిన ఏర్పాట్లను వివరించారు. ఇదిలావుండా, ఆనంద్ మల్లిగవాడ్ ను హైదరాబాద్ కు పిలిపించి, ఇక్కడ చెరువుల పునరుద్ధరణపై సహాయ సహకారాలను అందజేలాని హైడ్రో కోరనుంది. కూల్చివేతల వ్యర్థాలను తొలగించి ముందుగా సున్నం చెరువు, అప్పా చెరువు, ప్రగతినగర్ వద్ద ఉన్న ఎర్రకుంట, కూకట్‌పల్లి చెరువులకు పునరుజ్జీవనం కల్పించనున్నారు.

# బీఆర్ఎస్ హయాంలోనే భారీగా ఉద్యోగాల నియామకం

### మాజీ ఎంపీ వినోద్ కుమార్




**జనపదం, సిటీబ్యూరో:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షా 60 వేల ఉద్యోగాలు కేసీఆర్ భర్తీ చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పగలరా..? అని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ సవాల్ విసిరారు. సీఎం రేవంత్ ఆయన మంత్రివర్గ సహచరులు కేసీఆర్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరగనట్టు మాట్లాడడం సరికాదన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయుల నియామకాల ప్రోగ్రాంను సీఎం రాజకీయ వేదికగా వాడుకున్నారని, కేసీఆర్ కుటుంబ సభ్యుల ఉద్యోగాలు తీసేస్తే మీకు ఉద్యోగాలు వచ్చాయని రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులనుద్దేశించి అన్నారని చెప్పారు. కేసీఆర్ హయాంలో రికార్డు స్థాయిలో ఉద్యోగాలు ఇచ్చామని, తాము సరిగా చెప్పుకోలేకపోయామని అన్నారు. మార్కెటింగ్‌లో రేవంత్ రెడ్డిని మించినోడు లేడని, తాను రియల్ ఎస్టేట్ వ్యాపారి అని రేవంత్ తనకు తానే ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నారని పేర్కొన్నారు. అలా చెప్పుకున్న వారు మార్కె టింగ్‌లో ఎలా ఉంటారో తెలియదా..? అని వినోద్ కుమార్ పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో లక్షా 60వేల ఉద్యోగాలు ఇచ్చామని, ఈ విషయం భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌కు తెలియకపోతే వారు మంత్రులుగా ఉండటానికి అనర్హులన్నారు. కేసీఆర్ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి అని మంత్రులు అడుగుతున్నారు.. వారికి తెలియదా..? ప్రభుత్వం వద్ద లెక్కలు లేవా..? ఇప్పటి వరకు ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయో నిర్ధారించారా..? నిర్ధారిస్తే ఆ వివరాలు రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. తాజాగా మీరు ఇచ్చిన ఉపాధ్యాయ నియామకాలు కూడా సెప్టెంబర్ 6, 2023 నాడు ఇచ్చిన నోటిఫికేషన్‌కు కొనసాగింపేనని పేర్కొన్నా రు. కేవలం ఆరు వేల ఉద్యోగాలు నోటిఫికేషన్‌లో అదనంగా కలిపారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. డిసెంబర్ 31, 2024 లోగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మాటిచ్చిందని, ఆ ప్రకారం రేవంత్ రెడ్డి ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు.

# కేసీఆర్ ని విమర్శించడమే మీ విధానామా..?



- **చంద్రశేఖర్ రావు పేరు ఎత్తకుండా ఒక్క సభలోనైనా మాట్లాడారా?**
- **మీరిచ్చిన టీచర్ పోస్టులు కేసీఆర్ హయాంలో మంజూరు చేసినవే**
- **"మన ఊరు మన బడి, బ్రేక్ ఫాస్ట్ " పథకాలను ఎందుకు నిలిపివేశారు?**
- **సీఎం రేవంత్ ను ప్రశ్నించిన మాజీమంత్రి సబిత**

**జనపదం, బ్యూరో :** గడిచిన పది నెలలలో కేసీఆర్ గారి పేరు ఎత్తకుండా ఒక్క సభలో అయినా మాట్లాడారా ? మాట్లాడేటప్పుడు అది ప్రభుత్వ కార్యక్రమమా లేక పార్టీ కార్యక్రమమా అని ముఖ్యమంత్రి మర్చిపోతున్నారు. మీరు ఇచ్చాం అని చెబుతున్న టీచర్ పోస్టులు కేసీఆర్ మంజూరు చేసినవి కావా..? అని సీఎం రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. విద్యార్థులు, గురువుల ముందు కేసీఆర్ ను విమర్శించడం మీ విధానమా అని ఆమె ఎక్స్ వేదికగా నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎక్కడైనా మాట్లాడేముందు అది ప్రభుత్వ కార్యక్రమమా లేక పార్టీ కార్యక్రమమా అని విషయాన్ని మర్చిపోతున్నారని ఆమె ఎద్దేవా చేశారు. మీరు ఇచ్చారని చెబుతోన్న టీచర్ పోస్టులు కేసీఆర్ హాయంలో మంజూరు చేసినవి కావా? అని ప్రశ్నించారు. హైయ్యర్ ఎడ్యుకేషన్ లో 3202 పోస్టులు, యూనివర్సిటీలో 1081 పోస్టులు బీఆర్ఎస్ ప్రభుత్వమే మంజూరు చేసిందని గుర్తు చేశారు. అలాగే ఇంటర్, టెక్నికల్, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కు సంబంధించి 3896 కాంట్రాక్టు ఉద్యోగాలను గత కేసీఆర్ ప్రభుత్వమే క్రమబద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 25,000 టీచర్ పోస్టులను ఎందుకు ఇవ్వలేకపోయారో గురువులకు సీఎం రేవంత్ వివరిస్తే బాగుండేదని ఆమె తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని 6 వేల పాఠశాలలు మూతపడ్డాయని, సీఎం రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి ప్రజలను నమ్మించారని, ఇప్పుడు మూతపడిన పాఠశాలల జాబితాను విడుదల చేస్తే బావుంటుందని ఆమె పేర్కొన్నారు. "మన ఊరు మన బడి" కార్యక్రమాన్ని ఎందుకు ఆపేసారో ప్రజలకు వివరించాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఆరు లక్షల మంది పేద విద్యార్థులు చదువుతోన్న గురుకుల పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని మాజీ మంత్రి సబిత విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో "బ్రేక్ ఫాస్ట్ పథకం" నిలిపివేశారని ఆమె మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు 19 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు, ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్య భరోసా కార్డు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని మాజీమంత్రి సబిత డిమాండ్ చేశారు.

# ఎన్‌సీ శాసనసభాపక్ష నేతగా ఒమర్ అబ్దుల్లా

- ఆది లేదా సోమవారం సీఎంగా ప్రమాణం



**జనపదం, బ్యూరో** : నేషనల్ కాన్ఫరెన్స్ శాసన సభాపక్ష నేతగా ఆ పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీనగర్‌లో జరిగిన సమావేశంలో ఒమర్ అబ్దుల్లాను ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ అధినేత ఫరూక్ అబ్దుల్లా వెల్లడించారు. ఇటీవల జరిగి న ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలందరూ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ప్రధాన కార్యాలయం నవా–ఈ–సుబాలో సమావేశమై తమ నాయకుడిని ఎన్నుకున్నారు. జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ భాగస్వామ్యపక్షాలతో శుక్రవారం మరో సమా వేశం జరగనుందని ఫరూక్ అబ్దుల్లా చెప్పారు. అయితే తనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు ఒమర్ అ బ్దుల్లా కృతజ్ఞతలు తెలిపారు. నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు కూడా నేషనల్ కాన్ఫరెన్స్‌కు మద్దతు ప్రకటించారని చెప్పారు. కాంగ్రెస్ నుంచి లేఖ వచ్చాక, రాజ్‌భవన్ కు వెళ్లి గవర్నర్ ను కలుస్తామని తెలిపారు. మరోవైపు, ఆదివారం లేదా సోమ వారం ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా, పదేళ్ల తర్వాత జమ్ముకశ్మీర్లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్– కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. మ్యాజిక్ ఫిగర్ కన్నా రెండు సీట్లు ఎక్కువగానే గెలుచుకుంది. ఎన్సీ 42 చోట్ల, కాంగ్రెస్ 6 స్థానాల్లో విజయ దుందుభి మోగించాయి. బీజేపీ 29 సీట్లను సొంతం చేసుకుంది. పీడీపీ మూడు స్థానాలకు పరిమితమైంది. 10 స్థానాల్లో ఇతరులు గెలుపొందారు. అందులో ఒకరు ఆప్ అభ్యర్థి ఉన్నారు.

# ప్రమాదం చెప్పి రాదు..

- ఎవరి ప్రాణాలు వారే కాపాడుకోవాలి
- జాగ్రత్తగా ఉంటూ రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం.
- మంత్రి పొన్నం ప్రభాకర్
- రాష్ట్రంలో సగటున రోజుకి 20 మంది మరణిస్తున్నారని ఆందోళన



**జనపదం, బ్యూరో** : 'ప్రమాదం చెప్పిరాదు. అందుకే మన జాగ్రత్తలో మనం ఉండాలి. ఎవరి ప్రాణాలు వారే కాపాడుకోవాలి. ఈ దసరా పండుగ రోజు అందరం ఒక ప్రతిజ్ఞ చేద్దాం' అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం ట్విట్టర్ వేదికగా వీడియో సందేశం ఇచ్చిన ఆయన ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రవాణా శాఖ మంత్రిగా.. ఒక తల్లికి బిడ్డగా ఒక్క మాట చెబుతా దయచేసి వినాలని కోరారు. రాష్ట్రంలో సగటున రోజుకి 20 మంది రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దసరా చెడు పై మంచి విజయం సాధించిన దానికి గుర్తుగా కుటుంబ సభ్యులందరం కలిసి ఆయుధపూజ చేసే సమయంలో ఒక ప్రతిజ్ఞ చేద్దామని పిలుపునిచ్చారు. 'ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకుందాం' అని అందరూ ప్రతిజ్ఞ చేయాలని విజ్ఞప్తి చేశారు. మద్యం తాగి వాహనం నడపడం ప్రమాదానికి సూచిక అంటూ.. అందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు చెప్పారు. చివరగా ఒక భద్రత సందేశం వేల మంది ప్రాణాలు కాపాడుతుందని తెలిపారు.



# సీఎంవో కార్యాలయానికి సీల్

- దేశ రాజధానిలో మరో కీలక పరిణామం
- ఇంటి సోఫా కూర్చొని ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఢిల్లీ సీఎం అతిషీ

**జనపదం, న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి అధికారిక నివాసానికి పీడబ్ల్యూడీ శాఖ అధికారులు బుధవారంనాడు 'సీల్' వేశారు. ఢిల్లీ సీఎం అతిషి సామగ్రిని ఆమె అధికార నివాసం నుంచి పలు వాహనాల్లో పంపివేశారు. ముఖ్యమంత్రి అతిషి సీఎం నివాసాన్ని ఖాళీ చేయడంపై బీజేపీ లక్ష్యంగా ఆప్ నేతలు ఫైర్ అవుతున్నారు. ఢిల్లీ ప్రజల కోసం ఆమె అంకితభావం కూడా చూడాలంటూ సీఎం ఫోటోలను షేర్ చేస్తూ కేంద్రంపై ఫైర్ అవుతున్నారు. బీజేపీ ఆదేశానుసారం ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసాన్ని బలవంతంగా ఖాళీ చేయించారని సీఎంవో కార్యాలయానికి తాళం వేశారని ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్ లో అతిషికి సంబంధించిన కొన్ని చిత్రాలను షేర్ చేశారు. 'సీఎం నుంచి ఢిల్లీ ప్రజలు ఇచ్చిన ఇంటిని లాక్కున్నారు. కానీ, ఢిల్లీ ప్రజల కోసం పని చేయాలనే ఆమె అభిరుచిని ఎలా లాక్కుంటారు..' అని ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. దీంతో సంజయ్ సింగ్ పోస్ట్ చేసిన చిత్రాలలో, సీఎం అతిషి సోఫాలో కూర్చుని ఫైల్‌పై సంతకం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఆమె ముందు చాలా అట్ట పెట్టెలు కూడా ఉన్నాయి. అవి ముఖ్యమంత్రికి సంబంధించినవిగా ఆప్ నేతలు చెబుతున్నారు. అయితే ఆప్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎల్‌జీ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు జాబితా సిద్ధం చేసిన వెంటనే బంగ్లాను సీఎం అతిశీకి కేటాయించనున్నారని తెలిపారు.

# కోర్టుకెక్కిన రాజకీయాలు



(మొదటిపేజీ తరువాయి..)
కోర్టులో చూసుకుందాం.. అన్నట్టుగా అంతం కాదిది ఆరంభం అన్నట్లుగా మారిపోయింది.

**చూసుకుందాం..**

రాష్ట్ర పాలిటిక్స్ లో కొత్తగా లీగల్ ట్రెండ్ కనిపిస్తున్నది. ఏకవచన సంబోధనలు, వ్యక్తిగత ఆరోపణలకు దాకా వెళ్లే రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు కొత్త ఒరవడిని స్పీడ్ చేశారు. మాటకు మాటతో సరిపోవడం లేదు. కౌంటర్‌కి రివర్స్ కౌంటర్ ఇస్తే చాలడం లేదు. ఎన్ని చెప్పుకున్నా ఎంత తిట్టుకున్నా సంతృప్తి చెందడం లే దు. అంతకుమించి అన్నట్లు లీగల్ నోటీసులతో ప్రత్య ర్థులు, ఆరోపణలు చేసినవాళ్లను కోర్టుకీడుస్తున్నారు. ఇటీవల కొద్దికాలంగా లీగల్ నోటీసులతో రాజకీయాలు సాగుతున్నాయి. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతలు కూడా లీగల్ నోటీసుల వరకూ వెళ్లినా మళ్లీ వెనకడుగు వేశారు. ఏఐసీసీ అప్పటి రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జిగా పని చేసిన మాణిక్కం ఠాగూర్ రాష్ట్ర బీఆర్ఎస్ అగ్రనేతలకు మధురై కోర్టునుంచి నోటీసులు పంపించారు. ఆ తర్వాత ఆయన మారిపోవడం, రాష్ట్రంలో ఎన్నికలు, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కొంత మేరకు గ్యాప్ ఇచ్చారు. కానీ, మళ్లీ ఇప్పుడు లీగల్ నోటీసుల రాజకీయం మొదలైంది.

**హైడ్రాతో మొదలైంది..**

ఇటీవల కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌కి మాజీ మంత్రి హరీశ్రావు లీగల్ నోటీసు ఇచ్చారు. అవాస్తవ ఆరోపణలతో తన పరువుకు భంగం కలిగించారని హరీష్‌రావు న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. ఎప్పట్నించో రాజకీయాల్లో ఉన్న హరీష్‌రావుకు ఆరోపణలు, సవాళ్లు కొత్తకాకపోయినా ఈసారి కౌంటర్‌తో సరిపెట్టకుండా కాంగ్రెస్ ఎంపీకి లీగల్ నోటీస్ కూడా పంపారు. హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలతో పాటు మూసీ ప్రక్షాళన రాజకీయాలను షేక్ చేస్తోంది. విపక్షపార్టీలు ప్రభుత్వంపై విమర్శలతో విరుచుకుపడుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి హరీష్‌రావు, కేటీఆర్‌తో పాటు ముఖ్యనేతలు బాధితులకు అండగా నిలుస్తున్నారు. ఇదే సమయంలో హరీష్‌రావుపై కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. హిమాయత్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న ఆనంద్ కన్వెన్షన్‌లో హరీష్‌కి వాటాలున్నాయని ఆరోపించారు. మూసీ పర్యటన పేరుతో రాజకీయ డ్రామాలు చేస్తున్నారని, ఎందుకంటే హిమాయత్‌సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో కట్టిన కన్వెన్షన్‌లో హరీష్ రావుకు వాటాలున్నాయని అనిల్ సంచలన ట్వీట్ చేశారు. కన్వెన్షన్‌ని కాపాడుకునేందుకే హరీష్ డ్రామాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. ఆస్తులను కాపాడుకునేందుకు సామాన్య ప్రజలను అడ్డుపెట్టుకుంటున్న అగ్గిపెట్టె హరీష్.. ఖబర్దార్ అంటూ ఘాటుగా ట్వీట్ చేశారు. అనిల్ కుమార్ యాదవ్ ట్వీట్‌కి అదేస్థాయిలో హరీశ్రావు కౌంటర్ ఇచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనపై బురదజల్లే వికృత రాజకీయాలకి కాంగ్రెస్ తెరలేపిందని హరీష్‌రావు రియాక్టయ్యారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి గోబెల్స్ ప్రచారాల్ని ఆశ్రయిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. రేపు గోల్కొండ కోట, చార్మినార్‌లో కూడా వాటాలు ఉన్నాయంటారేమో.. అబద్ధపు ప్రచారాలు చేస్తున్నందుకు లీగల్ నోటీస్ పంపుతున్నానని స్పందించారు. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావాకి రెడీగా ఉండాలని అనిల్ కుమార్ యాదవ్‌ని హెచ్చరించారు.

**కేటీఆర్ కు...**

అనిల్ కుమార్ యాదవ్ ఘటనకు కొద్ది రోజుల ముందే సీఎం రేవంత్రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి లీగల్ నోటీస్ పంపారు. అమృత్ పథకం టెండర్ల విషయంలో తనపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీకి లీగల్ నోటీసులిచ్చారు. తనపై చేసిన తప్పుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పట్టణాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూపొందించిన అమృత్ పథకంలో సీఎం కుటుంబ సభ్యులు అవినీతికి పాల్పడ్డారని కేటీఆర్ చేసిన ఆరోపణలు దీనికి కారణమయ్యాయి. అయితే, సీఎం రేవంత్ రెడ్డి తన అధికారాన్ని ఉపయోగించి బావమరిది సృజన్ రెడ్డికి పనులు అప్పగించారని కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం కుటుంబాన్ని కేటీఆర్ టార్గెట్ చేసుకోవడటంతో కాంగ్రెస్ కీలకనేతలంతా స్పందించారు. మంత్రి పొంగులేటి ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి కూడా తన అల్లుడు సృజన్‌రెడ్డికి నిబంధనల ప్రకారమే టెండర్ దక్కిందని వివరణ ఇచ్చారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో సీఎం సెంట్రిక్‌గా బీఆర్ఎస్ ఆరోపణలు చేయటంతో కేటీఆర్‌కి లీగల్ నోటీసులు ఇచ్చారు సృజన్‌రెడ్డి. లీగల్ నోటీసులకు అటు కేటీఆర్, ఇటు అనిల్‌కుమార్‌యాదవ్ ఇద్దరూ ఇప్పటికైతే ఎలాంటి సారీ చెప్పలేదు.

**ఇప్పుడు సురేఖకు...**

తాజాగా నాగ చైతన్య, సమంత వ్యవహారం హాట్ హాట్గా నడుస్తున్నది. ఇది రాజకీయంగా ఎలా ఉన్నా ఇప్పుడు లీగల్ నోటీసులు మాత్రం చేరుకున్నాయి. ఇప్పటికే సురేఖపై సినీహీరో నాగార్జున లీగల్ నోటీసులు ఇవ్వడం, ఆయన కోర్టులో వాంగ్మూలం కూడా ఇచ్చారు. అంతేకాకుండా సురేఖకు నాంపల్లి కోర్టు నుంచి సమన్లు కూడా వచ్చాయి. ఇది సాగుతుండగా ఇప్పుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంత్రి సురేఖకు లీగల్ నోటీసు ఇచ్చారు. పరువు నష్టం దావా వేశారు.

**హద్దులు దాటుతున్నారు..**

రాష్ట్ర రాజకీయాలు రోజుకో ఇష్యూతో హీటెక్కుతున్నాయి. కొద్ది నెలలుగా తరుచూ ఏదో ఒక అంశంలో రాజకీయ పార్టీల మధ్య తీవ్ర మాటల యుద్ధం కొనసాగుతుంది. అధికార, ప్రతిపక్షాల మధ్య రోజుకొక అంశంపై మాటల తూటాలు పేలుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల నుంచే బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది. రుణమాఫీ, రైతుభరోసా, ఆరు గ్యారెంటీలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ కాంగ్రెస్ సర్కార్ పై విమర్శలు చేస్తుంటే, కాంగ్రెస్ పార్టీ కూడా బీఆర్ఎస్ పై అదే స్థాయిలో విరుచుకుపడుతుంది. ఇప్పుడు తెలంగాణలోని పార్టీలు ప్రజల సమస్యలను పక్కకు వదిలి వ్యక్తిగత దూషణకు దిగుతున్నారు. అంతటితో ఆగక కనీసం సభ్య సమాజంలో ఉన్నామా అన్న సంగతి మరిచి నేతలు విమర్శలకు దిగుతున్నారు. నేతల రాజకీయ రచ్చలో అసలు విషయాలు పక్కనదారినపడుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

**సొంత వైరమేనా..?**

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మొదటి నుంచి కూడా రాజకీయంగా వైరం ఉంది. ఇప్పుడు ఆ రాజకీయ శత్రుత్వం పార్టీల నుంచి కాస్తా నేతలకు చేరింది. ఇటీవల జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే తెలంగాణలో నేతలు హద్దులు మీరుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రజాక్షేత్రంలో ఉన్నామా అన్న సంగతి మరిచి మరీ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ మధ్య పచ్చగడ్డి వేస్తే మండిపోయేలా రాజకీయాలు ఉంటున్నాయి. ఇటు సీఎం రేవంత్ రెడ్డి కానీ, అటు బీఆర్ఎస్ ముఖ్యులు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఒక దశలో ఈ విమర్శలు కంట్రోల్ తప్పుతున్నారు. నోటికి ఏది వస్తే అదే విమర్శించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకరిపై ఒకరు వ్యక్తిగతంగా దుమ్మెత్తిపోసుకోవడంలో నేతలు తమ స్థాయిని మరిచిపోతున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. రాజకీయాల్లో చాలా సీనియర్లుగా చెప్పుకునే నేతలు సైతం తమ పరిధిని దాటి మాట్లాడుతున్నారు. ఐదారుసార్లు ఎమ్మెల్యేలుగా చేసిన నేతల భాష, వ్యవహరిస్తున్న తీరుపై కూడా రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది. వీధి రౌడీల్లా, గుండాల్లా నేతల ప్రవర్తన ఉందని సామాన్య ప్రజలు అనుకునేలా నేతల ప్రవర్తన ఉంటుంది. ఇటీవల సీనియర్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీ మాట్లాడిన తీరు తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపింది. ఆ తర్వాత కొద్ది రోజులకు హైదరాబాద్ లో మరో ఘటన అందరినీ షాక్ గురి చేసింది. సీనియర్ ఎమ్మెల్యే ఐన అరికపూడి గాంధీ తన అనుచరులతో కలిసి మరో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటి మీదకు దాడికి వెళ్లే యత్నం చేశారు. ఇది మరిచిపోతున్నారనుకుంటున్న క్రమంలో తాజాగా మంత్రి కొండా సురేఖ వ్యవహారం రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తుంది. కొద్ది రోజుల క్రితం ఆమెను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోల్ చేశారు. ఈ నేపథ్యంలోనే కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సెన్సేషనల్ గా మారాయి. తెలిసో తెలియకో కొండా సురేఖ సినీ పరిశ్రమను కూడా రాజకీయాల్లోకి లాగింది. సురేఖ ఏ ఉద్దేశంతో ఆ కామెంట్స్ చేసిందో ఇప్పుడు ఆ కామెంట్స్ రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి.

# మిత్రుడి పాడే మోసిన మాజీ ఎంపీ నామా

**జనపదం, ఖమ్మం** : ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి బొప్పన గాంధీ మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభపక్ష నేత, మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. చిరకాల మిత్రుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఖమ్మం జిల్లా గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధిలో గాంధీ చేసిన కృషి మరువలేనిదని, పరిశ్రమను ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర విశేషమని అభినందించారు. కొద్ది రోజుల క్రితం అమెరికాలో మృతి చెందిన గాంధీ భౌతికకాయాన్ని గురువారం ఖమ్మం నగరంలోని బ్యాంకు కాలనీలోని సృజన అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారి నివాసానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు, నామ సోదరుడు శీతయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ కుటుంబ సభ్యులను నామ పరామర్శించి, ఆప్తమిత్రుడి పాడే మోసి తమ మధ్య ఉన్న స్నేహ బంధం ఎలాంటిదో చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు, పలువురు రాజకీయ నాయకులు, గ్రానైట్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# రాకపోకలు ప్రారంభించాలి

- ప్రకాష్ నగర్ లో లెవల్ క్యాజ్ వే పనులు11లోగా పూర్తి చేయాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- అధికారులకు ఆదేశాలు



**జనపదం, ఖమ్మం :** దసరా పండుగ నుంచి ప్రకాష్ నగర్ బ్రిడ్జి దగ్గర పాత లో లెవల్ క్యాజ్ వే డైవర్షన్ రోడ్డు పనులు పూర్తి చేసి, రాకపోకలు ప్రారంభించాలని, ఆ దిశగా పనులను 11 వ తేదీ సాయంత్రం లోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టంచేశారు. గురువారం మంత్రి, ఖమ్మం పట్టణంలోని 28వ డివిజన్ ప్రకాష్ నగర్ లో పర్యటించి టి.యు.ఎఫ్. ఐ.డి.సి. నిధులు రూ.కోటి 90 లక్షలతో చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి ప్రకాష్ నగర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరదల కారణంగా దెబ్బతిన్న ప్రకాష్ నగర్ బ్రిడ్జిని యధాస్థితికి తీసుకొని వచ్చేందుకు అప్పగించిన నిర్దేశిత గడువు 100 రోజుల్లోగా పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలన్నారు. ప్రజలకు రాకపోకలకు ఇబ్బందుల పరిష్కారం దృష్ట్యా ప్రకాష్ నగర్ వద్ద ఉన్న పాత లో లెవల్ క్యాజ్ వే డైవర్షన్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలన్నారు. పండుగ రోజు నుండి వాహనాల రాకపోకలు జరిగేలా చూడాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నీరజ, కార్పొరేటర్లు, ఆర్ అండ్ బి డీఈ చంద్రశేఖర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బోర్డు తిప్పేసిన సినార్జీ యూనివర్సల్

**ఉద్యోగాలిస్తామని బోర్డు తిప్పేసిన సాఫ్ట్‌వేర్ కంపెనీ**




**జనపదం, హైదరాబాద్ సిటీ :** ఉద్యోగాలిస్తామని చెప్పి నిరుద్యోగుల దగ్గర డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసింది హైదరాబాద్ మాదాపూర్‌లోని సినార్జీ యూనివర్సల్ అనే కంపెనీ. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇస్తామ ని డబ్బులు వసూలు చేసింది. కావూరిహిల్స్ లోని వీవీ చాంబర్స్ నాలుగో అంతస్తులో ఉన్న సినార్జీ యూనివర్సల్ కంపెనీ ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షలు వసూలు చేసింది. అనంతరం బాధితులకు ఆఫర్ లెటర్ చేతికిచ్చి వర్క్ ఫ్రాం హోమ్ అని చెప్పి ఆరు నెలలు గడిపేసింది. అలా దాదాపు 500 మంది దగ్గర డబ్బులు తీసుకుంది.

**జీతాలు చెల్లించకపోవడంతో..**

గత ఆరు నెలల నుంచి జీతాలను చెల్లిం చడం లేదని కంపెనీ యజమాన్యాన్ని ఉద్యోగులు ప్రశ్నించారు. ప్రాజెక్టులు లేవని అందుకే జీతాలు చెల్లించలేకపోతున్నామని సినార్జీ తెలిపింది. దీనికితోడు గత కొద్ది రోజుల నుంచి యజమాన్యం ఆఫీస్‌కు కూడా రావట్లేదు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన ఉద్యోగులు మాదాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రూ.కోట్లతో పరారైన కంపెనీ ప్రతినిధులను వెతికే పనిలో పోలీసులు ఉన్నారు. బాధితులు రూ.కోట్లలో ఉండడంతో ఈఓడబ్ల్యూ లో ఫిర్యాదు చేయాలని మాదాపూర్ పోలీసులు సూచించారు.

# గీత వృత్తికి గత ప్రభుత్వం ప్రోత్సాహం

- ఈత, తాటి వనాలతో గౌడన్నలకు సత్ఫాలితాలు
- మాజీ మంత్రి హరీశ్ రావు కృషి ఫలించింది..
- హర్షం వ్యక్తం చేసిన గౌడన్నలు

**జనపదం, సిద్దిపేట** : కుల వృతులను ప్రోత్సహించే విధంగా గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమంతో ఈత, తాటి, గిరిక తాటి మొక్కలను విరివిగా పెంచడంతో నేడు వాటి ఫలాలను గౌడన్నలు అందుకుంటున్నారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేట పట్టణంలోని ఒకటో వార్డు లింగారెడ్డిపల్లి చెరువు కట్టపై పెంచిన ఈత వనమే ఇందుకు నిదర్శనం. గత ప్రభుత్వ హయాంలో లక్షలాది మొక్కలను నాటించి గౌడన్నలకు వెన్నుదన్నుగా నిలిచిన అప్పటి నీటి పారుదల, ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు కృషి మరువలేనిది. మద్యం మత్తుకు యువత బానిస కావద్దు అని అలాగే గీత వృత్తిని ప్రోత్సహించే విధంగా పని చేసిన కృషిని గీత కార్మికులు అభినందిస్తున్నారు. రోగాలను నయం చేసే గుణాలు ఈత, తాటి కల్లుకు ఉండడంతో ప్రజల్లో కల్లుకు డిమాండ్ పెరిగింది. ఈ సందర్భంగా జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు పల్లె బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ ఈత, తాటి కల్లు దివ్య ఔషధం, సర్వ రోగ నివారిణిగా పనిచేస్తుందన్నారు. హరీష్ రావు కృషి అభినందనీయమని, మేము ఎల్లవేళలా ఆయనకు రుణపడి ఉంటామన్నారు. యువత లిక్కర్ కు బానిస కాకుండా కల్లును సేవించి ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు.



# లావోస్ పర్యటనలో ప్రధాని మోదీ

- మయన్మార్‌లో సంఘర్షణలపై చర్చలు
- ప్రవాసభారతీయుల ఘనస్వాగతం


**జనపదం, న్యూఢిల్లీ :** ఆసియాన్ దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకునే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ లావోస్ పర్యటనకు వెళ్లారు. లావోస్‌లో జరగనున్న 21వ ఆసియాన్ ఇండియా, 19వ తూర్పు ఆసియా సదస్సుల్లో ప్రధాని మోదీ పాల్గొంటారు. పీపుల్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ లావోస్ ప్రధాని ఆహ్వానం మేరకు రెండు రోజుల లావోస్ పర్యటనకు ప్రధాని మోదీ వచ్చారు. లావోస్ పర్యటన ఆసియాన్ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని తన పర్యటన సంద్భంగా మోదీ అన్నారు. లావోస్ చేరుకున్న ప్రధాని మోదీకి స్థానిక డబుల్ ట్రీ హోటల్‌లో ప్రవాసభారతీయులు ఘనస్వాగతం పలికారు. ప్రవాస భారతీయులను ముఖ్యంగా చిన్నారులను ఆప్యా యంగా పలకరించిన ప్రధాని వారికి ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. స్థానిక ప్రవాస భారతీయులు ప్రధాని నరేంద్ర మోదీకి జాతీయజెండాలు, కళాకృతులు అందజేశారు. అనంతరం స్థానిక యువకులతో కలిసి ప్రధాని మోదీ గాయత్రీ మంత్రం సహా వివిధ శ్లోకాలను పఠించారు. బౌద్ధ భిక్షువులతో కలిసి ప్రధాని మోదీ ప్రార్థనలు చేశారు. స్థానిక కళాకారిణుల సంప్రదాయ నృత్యాలను వీక్షించిన ప్రధాని వారిని అభినందించారు. లావోస్ సంస్కృతి, వారసత్వ కట్టడాలు, ప్రాచీన కళల వివరాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రధాని నరేంద్ర మోడీ ఆసక్తిగా తిలకించారు. సాంస్కృతిక ప్రదే శాల పునరుద్ధరణ, విద్యుత్ ప్రాజెక్టులతో పాటు, మయన్మార్‌లో కొనసాగుతున్న సంఘర్షణలపై ప్రధాని మోదీ లావోస్ ప్రధాని సొనెక్సా సిఫనాడోన్‌తో చర్చించనున్నారు.




# 'జమిలి' ఆలోచనను విరమించుకోండి

- 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రణాళికను రద్దు చేయండి ..
- కేరళ అసెంబ్లీ తీర్మానం

**జనపదం, తిరువనంతపురం:** దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రణాళికను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేరళ కోరింది. ఈ ప్రతిపాదన అప్రజాస్వామ్యమని, నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కేరళ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. కే రళ సీఎం పినరయి విజయన్ తరపున ఆ రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఎంబీ రాజేష్ ఈ తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రతిపాదన దేశంలోని సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. 'ఈ ప్రతిపాదన అప్రజాస్వామికం. దేశంలోని సామాజిక, సాంస్కృతిక, రాజకీయ వైవిధ్యాలను దెబ్బతీసే ప్రయత్నం. ఖర్చులను తగ్గించడానికి, సులభతరమైన పాలనను నిర్ధారించడానికి సులభమైన మార్గాలున్నాయి. రాజ్యాంగంలోని ప్రధానమైన సమాఖ్య నిర్మాణాన్ని నాశనం చేయడం, ప్రజల హక్కులను సవాలు చేయడం, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక స్వపరిపాలన హక్కులను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదన ఉంది' అని అన్నారు. కాగా, 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రతిపాదన అధికార కేంద్రీకరణకు దారితీస్తుందని మంత్రి ఎంబీ రాజేష్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో కేంద్రీకృత, ఏకీకృత పరిపాలనా వ్యవస్థను అమలు చేయడానికి బీజేపీ, (ఆర్ఎస్ఎస్) ఎజెండాలో ఇది ఒక భాగమని ఆయన ఆరోపించారు. మరోవైపు కేరళ అసెంబ్లీలో బీజేపీకి ఒక్క శాసనసభ్యులైనా లేరు. అలాగే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రతిపాదనకు వ్యతిరేకంగా తీర్మానం చేసిన మొదటి రాష్ట్ర అసెంబ్లీగా కేరళ నిలిచింది.



# ప్రపంచ స్థాయి వేదికపై తెలంగాణ టూరిజం ప్రమోషన్

- ఐఎమ్ఇఎక్స్ అమెరికా 2024 ట్రేడ్ షో లో రాష్ట్ర టూరిజం స్టాల్ ఏర్పాటు
- పాల్గొన్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**జనపదం, బ్యూరో :** లాస్ వెగాస్‌లోని మాండలే బేలో నిర్వహించిన ఐఎంఈఎక్స్ అమెరికా 2024 ట్రేడ్ షో లో తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు పాల్గొన్నారు. ప్రపంచ స్థాయి వేదికపై ఏర్పాటు చేసిన రాష్ట్ర టూరిజం స్టాల్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ శతాబ్దాల ఘనమైన చరిత్ర, వారసత్వం, సుసంపన్న సంస్కృతి, ప్రకృతి రమణీయత, పర్యాటక ప్రాంతాల గురించి స్థానిక మీడియా, ట్రావెల్ సొల్యూషన్స్ ప్రతినిధులు, తెలుగు అసోసియేషన్ సభ్యులతో ఆయన చర్చించారు. విశ్వనగరమైన 'హైదరాబాద్ భారతదేశం యొక్క సదస్సుల రాజధాని'గా అంతర్జాతీయ సదస్సులకువేదికగా, ప్రపంచ స్థాయి పెట్టుబడులకు కేంద్ర బిందువు గా మారిందని, పర్యాటక, వినోదం, వ్యాపార, ఐటీ, హెల్త్, ఫార్మా రంగాల్లో అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని మంత్రి అన్నారు. ప్రగతిశీల విధానాలతో తమ ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు పర్యాటక రంగంలో భాగస్వాముల సహకారంపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. అనంతరం వాణిజ్య ప్రదర్శనలో ఏర్పాటు చేసిన విదేశీ స్టాళ్లను మంత్రి జూపల్లి సందర్శించారు. కొత్త అనుభూతులు, అన్వేషించని ప్రదేశాలను చూడాలని కోరుకునే నేటి తరం పర్యాటకులకు స్వాగతం పలికేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్దంగా ఉందని, ఘనమైన వారసత్వ సంపదతో అలరారుతున్న తెలంగాణ లో పర్యటించాలని ఆయా దేశాల ప్రతినిధులకు మంత్రి జూపల్లి ఆహ్వానం పలికారు. భారతదేశం నుండి వచ్చిన అతి కొద్దిమందిలో ఒక తెలంగాణ ప్రతినిధిగా ఈ ట్రేడ్ షోలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డీ.ఎస్. ఓంప్రకాశ్, టీఎస్టీడీసీ మార్కెటింగ్ జీఎం కె.అంజి రెడ్డి, హెచ్ సీవీబీ సీఈవో గ్యారీ ఖాన్, హైటెక్స్, మీటీ, నాంధారి ఈవెంట్స్ నుండి సహ ప్రదర్శకులు హాజరయ్యారు.

# చట్టం ముందు అంతా సమానమే..

- కవిత కేసును కేజ్రీ కోణంలో చూడలేం..
- రాజ్యసభ సభ్యులు అభిషేక్ మను సింఘ్వీ
- మహిళలకు భరోసా కల్పించాలని పిలుపు..



**జనపదం, హైదరాబాద్ :** అడ్వకేట్లు ఎప్పుడూ ప్రతిపక్ష పాత్ర పోషించాలని, అప్పుడే ప్రజల్లో ఆదరణ ఉంటుందని రాజ్యసభ సభ్యులు అభిషేక్ మను సింఘ్వీ అన్నారు. బేగంపేట్ లోని హరిత ప్లాజా హోటల్లో అభిషేక్ మను సింఘ్వీ సన్మాన కార్యక్రమం గురువారం జరిగింది. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయపరమైన అంశాలపై లీగల్ సెల్ సభ్యుల సమావేశంలో మను సింఘ్వీ మాట్లాడారు. ప్రస్తుతం న్యాయవాదులు అధికారం ఎటు ఉంటే అటు వెళ్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. తరుచుగా లీగల్ హెడ్ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అలాగే ఎమ్మెల్సీ కవిత కేసును ఉద్దేశించి కూడా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్ కేసు వ్యవహారంతో కవిత కేసును చూడలేమన్నారు. రెండు వేర్వేరు అని పేర్కొన్నారు. విచారణ పూర్తి చేశాకే మహిళగా కవితను అరెస్ట్ చేశారని, న్యాయవ్యవస్థ ముందు అందరం సమానమే అన్నారు.

**మహిళలకు భరోసా కల్పించాలి...**
టీపీసీసీ లీగల్ సెల్ క్షేత్రస్థాయిలో విస్తరించాలని సింఘ్వీ సూచించారు. ప్రతి మహిళకు మన లీగల్ సెల్ తరపు నుంచి భరోసా కల్పించాలన్నారు. హైదరాబాద్ కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కమిటీలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమానికి హాజరైన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా నన్నారు. లీగల్ సెల్ కి పూర్తి టీపీసీసీ సహకారం ఉంటుందన్నారు. జూనియర్ న్యాయవాదుల స్టైఫండ్, ఇండ్ల స్థలాల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, హై కోర్టు కొత్త భవనాన్ని సకాలంలో పూర్తి చేసేలా కృషి చేస్తామని టీపీసీసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# మంత్రి సురేఖకు కోర్టు నోటీసులు

- పరువునష్టం పిటీషన్ పై నాంపల్లి ప్రత్యేక కోర్టు ఆదేశాలు..
- కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలకు కోర్టును ఆశ్రయించిన నాగార్జున
- విచారణ ఈ నెల 23కు వాయిదా..

**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్ర మంత్రి కొండా సురేఖ నోటి దురుసు వ్యవహారం ఆమె మెడకు చుట్టుకుంటున్నది. తన కుటుంబంపై మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సినీనటుడు అక్కినేని నాగార్జున నాంపల్లి కోర్టులో పరువు నష్టం కేసు వేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం విచారణ చేపట్టిన నాంపల్లి ప్రత్యేక కోర్టు మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది. తన కుటుంబంతో పాటు, కుమారుడు నాగచైతన్య-సమంత విడాకుల వ్యవహారంపై మంత్రి సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారని నాగార్జున గత వారం నాంపల్లి కోర్టును ఆశ్రయించగా ఈ రోజు నోటీసులు జారీ చేసింది. పది రోజుల క్రితం రాజకీయ విమర్శల్లో భాగంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ నాగార్జున, నాగచైతన్య, సమంతల పేర్లను ప్రస్తావించారు. ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలో నాగార్జున మంత్రిపై నాంపల్లి కోర్టులో క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు.

**అసలేం జరిగిందంటే..?**
తనను సామాజిక మాధ్యమాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ట్రోల్ చేస్తున్నారంటూ మంత్రి కొండా సురేఖ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో తెలుగు చిత్ర పరిశ్రమను కూడా ప్రస్తావించారు. ముఖ్యంగా సమంత, నాగచైతన్య, నాగార్జున పేర్లను ప్రస్తావించడం, వారి వ్యక్తిగత విషయాలను మీడియా ముఖంగా మాట్లాడడంతో అవి కాస్త హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలో నాగార్జున మంత్రిపై నాంపల్లి కోర్టులో క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. అయితే అక్కినేని కుటుంబం, నటి సమంతపై చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేగడంతో మంత్రి కొండా సురేఖ ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. తన వ్యాఖ్యల ఉద్దేశం మహిళల పట్ల ఒక నాయకుడి చిన్నచూపు ధోరణిని ప్రశ్నించడమే అన్నారు. సమంత మనోభావాలను దెబ్బతీయడం కాదని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. స్వయం శక్తితో ఆమె ఎదిగిన తీరు తనకు కేవలం అభిమానం మాత్రమే కాదు ఆదర్శం కూడా అని పేర్కొన్నారు. తన వ్యాఖ్యల పట్ల సమంత కానీ, ఆమె అభిమానులు కానీ మనస్తాపానికి గురైనట్లయితే బేషరతుగా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పారు.

## సురేఖ పరువు నష్టం దావా..

**(మొదటిపేజీ తరువాయి)** మాజీమంత్రి కేటీఆర్ తరపున న్యాయవాది ఉమా మహేశ్వర్ రావు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ నేతలు సత్యవ తిరాథోడ్, తుల ఉమ, బాల్క సుమన్, దాసోజు శ్రవణ్ ను సాక్షులుగా కేటీఆర్ పేర్కొన్నారు. పదే పదే కావాలని దురుద్దేశంతో కొండా సురేఖ ప్రణాళికాబద్ధంగా చేసిన వ్యాఖ్యను నేరపూరితంగా చూడాలని పిటిషన్ లో కేటీఆర్ కోరారు. గతంలో కూడా మంత్రి సురేఖ ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలు చేసి ఎన్నికల సంఘం చీవాట్లు తిన్న ఘటనలను పిటిషన్ లో ప్రస్తావించారు.



# ఎక్కడోళ్లక్కడ పోండి..

- ఐఏఎస్, ఐపీఎస్ల కేడర్ విభజనపై కేంద్రం ఆదేశం
- అభ్యంతరాలను తోసిపుచ్చిన కేంద్రం
- తెలంగాణ నుంచి రిలీవ్ చేస్తూ డీవోపీటీ ఆదేశాలు
- ఈ నెల 16లోగా రిపోర్ట్ చేయాలి..
- ఏపీలో పని చేస్తున్న ఐఏఎస్ లకు అవే ఆదేశాలు..
- తెలంగాణలో రిపోర్ట్ చేయాలన్న కేంద్రం






**జనపదం, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్ర విభజన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ సారి అనూహ్యంగా ఐఏఎస్ లపై దాని ప్రభావం పడింది. రాష్ట్ర విభజన అనంతరం కూడా తెలంగాణలో కొనసాగుతూ వస్తున్న ఏపీ క్యాడర్ కు చెందిన ఐపీఎస్ లకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ షాక్ ఇచ్చింది. తమను తెలంగాణ క్యాడర్‌లోనే కొనసాగించాలని పెట్టుకున్న ఐపీఎస్ లు పెట్టుకున్నదరఖాస్తులను తిరస్కరించింది. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ కు కేటాయించి.. ఇన్నాళ్లు తెలంగాణలో పని చేసింది చాలని స్పష్టం చేసింది. వెంటనే ఏపీ క్యాడర్‌లో జాయిన వ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా కొనసాగుతున్న ఆమ్రపాలి కాట, విద్యుత్ శాఖ కార్యదర్శిగా కొనసాగుతున్న రోనాల్డ్ రోస్, వాణిప్రసాద్, వాకాటి కరుణ, మల్లెల ప్రశాంతితో పాటు పలువురు అధికారులను ఏపీ కేడర్‌కు కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఐఏఎస్ అధికారుల పేరుతో లేఖను రాస్తూ.. వాటి కాపీలను తెలంగాణ, ఏపీ చీఫ్ సెక్రెటరీలకు కేంద్రం పంపింది. అయితే, తెలంగాణ కేడర్ కావాలంటూ 11 మంది అధికారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అయితే, అధికారుల వినతిని కేంద్రం తిరస్కరించింది. అధికారులంతా సొంత రాష్ట్రంలో 16లోగా రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఇదీలావుంటే.. ఐఏఎస్ లు అందరిలో కాట అమ్రపాలి పోస్టింగ్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది. ప్రభుత్వంలో ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి నమ్మినబంటుగా పేరొందిన ఆమెను వదిలించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం లేదనే ప్రచారం జరుగుతున్నది.

**ఏపీ వద్దు తెలంగాణే ముద్దు..**
రాష్ట్ర విభజన తర్వాత సివిల్ సర్వీసు అధికారుల కేటాయింపు కోసం ఖండేకర్ కమిటీని నియమించారు. ఆ కమిటీ నిబంధనల ప్రకారం విభజించింది. అయితే ఆ నివేదికలో పేర్కొన్న పలువురు తమ క్యాడర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి, క్యాట్‌కు దరఖాస్తుకు పెట్టుకున్నారు. ఏపీకి కేటాయించిన ఎక్కువ మంది తాము తెలంగాణ స్థానికతతో ఉన్నామని తమకు తెలంగాణ క్యాడరే కావాలని ఉండిపోయారు. అలాంటి అధికారి అయిన సోమేష్ కుమార్ ఏపీలో సీఎస్‌గా ఉండగా కోర్టు ఏపీకి వెళ్లాల్సిదేనని స్పష్టం చేసింది. దాంతో ఆయన తెలంగాణ నుంచి రిలీవ్ అయి ఏపీలో రిపోర్ట్ చేసి వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఇప్పుడు ఆమ్రపాలికి కూడా దాదాపుగా అదే పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ కమిషనర్ గా ఉన్న ఆమె ఉన్న పళంగా ఏపీలో రిపోర్టు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఖండేకర్ కమిటీ సిఫారసులు చేసిన సమయంలో స్థిర నివాసం అనే కాలమ్‌ను కీలకంగా తీసుకున్నారు. యూపీఎస్సీకి దరఖాస్తు చేసిన సమయంలో కాట ఆమ్రపాలి తన పర్మినెంట్ అడ్రస్‌గా విశాఖపట్నంను పేర్కొన్నారు. ఖండేకర్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత ప్రత్యూష్ సిన్హా కమిటీ ఆ నివేదిక ఆధారంగా క్యాడర్ ను కేటాయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఖండేకర్ కమిటీ ఆమెను ఏపీకి కేటాయించింది. అయితే తనను తెలంగాణ స్థానికురాలిగా పరిగణించి తెలంగాణకే కేటాయించాలని ఆమె అప్పీల్ చేసుకున్నారు. ప్రత్యూష్ సిన్హా కమిటీ మొదట్లోనే ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. హైకోర్టు కూడా ఖండేకర్ కమిటీ ఆధారంగా ప్రత్యూష్ సిన్హా కమిటీ చేసిన సిఫారసులనే అమలు చేయాలని స్పష్టం చేసింది. కాట అమ్రపాలికి ప్రస్తుతం అన్ని మార్గాలు మూసుకుపోయినట్లేనని ఆమె ఖచ్చితంగా తెలంగాణలో రిలీవ్ అయ్యి ఏపీలో రిపోర్టు చేయాల్సిందేనని భావిస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత వరంగల్ జిల్లాకు కలెక్టర్ గా చేసిన ఆమ్రపాలి తర్వాత కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఓఎస్డీగా, ప్రధానమంత్రి కార్యాలయంలోనూ పని చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ తెలంగాణకు వచ్చారు. రేవంత్ సర్కార్ లో ఆమెకు కీలక పోస్టులు దక్కాయి. ఇప్పుడు ఏపీకి తప్పక వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఆమ్రపాలి వెళ్లాల్సిందే..**
గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ పోస్టుతోపాటు పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న 2010 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారిణి కాటా ఆమ్రపాలి తనను తెలంగాణ స్థానికత ఉన్న అధికారిగా గుర్తించాలని చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. ఖండేకర్ కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా ఆమె ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కే చెందుతారని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇదీలావుంటే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్ర సర్వీసుల్లో కొనసాగిన ఆమ్రపాలి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం



లోకి వచ్చిన తర్వాత తిరిగి తెలంగాణ సర్వీసుల్లో చేరారు. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఆమెకు జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, మూసీ రివర్ ఫ్రంట్ మేనేజింగ్ డైరెక్టర్, హెచ్‌జీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ కమిషనర్‌గా కొనసాగుతున్న సమయంలోనే జీహెచ్‌ఎంసీ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలో ఎంతో మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నప్పటికీ ఆమెకే ఐదు కీలక పోస్టులను సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించారు. ఆ తర్వాత జరిగిన బదిలీల్లో మిగతా పోస్టులను నుంచి ఆమెను జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. అయితే కేంద్రం తాజా నిర్ణయంతో ఆమె ఏపీకి వెళ్లనున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆమ్రపాలి ఏపీకి వెళితే రాష్ట్ర ప్రభుత్వానికి గొడ్డలిపెట్టు అనే ప్రచారం అధికారిక వర్గాల్లో జోరుగా సాగుతున్నది.



# ఊరికి బైలెల్లిన నగరం..

- రాజధాని అంతా రద్దీగానే..
- రోడ్లన్నీ ఫుల్ ట్రాఫిక్...
- దసరా ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు..

**జనపదం, హైదరాబాద్ సిటీ:** దసరా సమీపిస్తుండడంతో హైదారాబాద్ నగరం ప్రయాణికుల రద్దీ తో కిక్కిరిసిపోతున్నది. గురువారం నగరం నుంచి ప్రజలంతా సొంత ఊళ్లకు బయలుదేరడంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు జనాలతో కిటకిటలాడాయి. సికింద్రాబాద్, నాంపల్లి లింగంపల్లి, కాచిగూడ ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రయాణికులతో నిండిపోయాయి. దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు, ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నప్పటికీ రద్దీ తగ్గడం లేదు. సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్, గౌలిగూడలోని ఎంజీబీఎస్ తో పాటు చాలా బస్ పాయింట్లు జనసందోహంగా మారాయి. ప్రయాణికులు కనీసం సౌకర్యవంతంగా తిరగడానికి ప్లాట్ ఫాంలు కూడా సరిపోవడం లేదు. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎల్బీ నగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్ బీ వంటి రద్దీ ప్రదేశాల్లో కూడా ఆర్టీసీ పికప్ పాయింట్లను ఏర్పాటు చేసింది. పికప్ పాయింట్లు ఏపీ, మహారాష్ట్ర. కర్నాటక సహా వివిధ రాష్ట్రాలకు వెళ్తుతున్న ప్రయాణికులతో నిండిపోయాయి.



# పోయిరా మాయమ్మా..

**జనపదం, కల్చరల్:** రాష్ట్ర వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు మిన్నంటాయి. తెలంగాణ సంస్కృతి విశిష్టతకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు పల్లె నుంచి పట్నం వరకు ఘనంగా జరిగాయి. మహిళలు, యువతులు, చిన్నారులు ఉయ్యాల పాటలతో సందడి చేశారు. ఈనెల 2వ తేదీన ఎంగిలిపూలతో ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు గురువారం నాడు సద్దులతో ముగిశాయి. తీరొక్క పూలతో బతుకమ్మ ను భక్తి శ్రద్ధలతో పేర్చి, గంగమ్మ ఒడిలో కలిపారు. హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ వద్ద రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వందలాదిమంది మహిళలు పాల్గొని సంబరాలు చేసుకున్నారు. బతుకమ్మలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లేజర్ షో అందరని ఆకర్షించింది. హన్మకొండలోని పద్మాక్షి అమ్మవారి ఆలయం మహిళలతో కిక్కిరిసిపోయింది. బతుకమ్మలతో పెద్ద ఎత్తున మహిళలు తరలి వచ్చి ఆటలాడారు. చివరకు బతుకమ్మలను చెరువులు, నదులతో పాటు బతుకమ్మ ఘాట్లలో నిమజ్జనం చేసి వెళ్లిరా గౌరమ్మను సాగనంపారు. అనంతరం మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అలాగే వికారాబాద్ జిల్లా తాండూరులో మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. కరీంనగర్, నల్గొండ, అదిలాబాద్ తదితర జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు సోలాహాలంగా జరిగాయి.

**భవిష్యత్ తరాలకు బతుకమ్మ గురించి తెలియాలి.... మంత్రి సీతక్క**
తెలంగాణలో సంప్రదాయంగా ప్రతిఏటా నిర్వహించే బతుకమ్మ పండుగ విశిష్టత గురించి భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క అన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించేందుకు రాష్ట్ర సాంస్కృతిక శాఖకు సీఎం రేవంత్ రెడ్డి పూర్తి స్వేచ్ఛనిచ్చారని తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై జరిగిన బతుకుమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. తెలంగాణతో పాటు విదేశాల్లో కూడా బతుకమ్మ సంబరాలను భక్తి శ్రద్ధలతో అక్కడున్న తెలంగాణ ప్రజలు జరుపుకుంటున్నారని అన్నారు. బతుకమ్మలోని ప్రతి పువ్వుకో ఒక గుణం ఉందని, అలాగే ఈ పండుక వెనుక భక్తితో పాటు శాస్త్రీయ కారణాలు ఉన్నాయన్నారు. గౌరమ్మ చేసే పసువులో యాంటీబయోటిక్ ఉంటుందని, చెరువుల్లో వేసే పూలతో నీరు శుద్ధి అవుతుందన్నారు. తెలంగాణలోని వాగులు, వంకలు, గుట్టలు, చెరువులపై ఆధారపడిన రైతులు వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. పంటపొలాలకు నీరందిస్తున్న చెరువులను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆమె పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా పురుషులు సహాయసహకారాలు అందించాలని మంత్రి సీతక్క కోరారు. అలాగే మహిళలతో ఎలా ప్రవర్తించాలనే అంశాలపై పిల్లలకు చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు నేర్పించాలని ఆమె సూచించారు.



ఘనంగా సద్దుల బతుకమ్మ
ఆడిపాడిన ఆడపడుచులు..
రాష్ట్రమంతా మార్మోగిన పల్లె సంస్కృతి..
ముగిసిన తొమ్మిది రోజుల సంబురం
ట్యాంక్ బండ్ వేడుకల్లో వేలాది మహిళలు..








# బతుకమ్మ పండుగతో తెలంగాణ ఖ్యాతి విదేశాలకు

**మాజీ మంత్రి హరిశ్ రావు**



బతుకమ్మ పండగ సందర్బంగా సిద్దిపేట కోమటి చెరువు వద్ద నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు కుటుంబ సామెతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అత్యంత గొప్పగా జరుపుకునే పండుగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మతో ఒక తెలంగాణలో కాదు దేశ విదేశాల్లో తెలంగాణ ఖ్యాతి పెంపొందిందన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలన్నారు.. తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కెసిఆర్ బతుకమ్మ పండుగను అధికారికంగా గుర్తించారని అన్నరు. గతంలో బతుకమ్మ పండుగకు కెసిఆర్ ఆడపడుచులకు చీరలను అందించారని గుర్తుచేశారు. ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా సంతోషంగా జరుపుకుంటారని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మకు రెండు చీరలతో పాటు 500 ఇస్తామన్నారు కానీ ఎక్కడ ఇవ్వలేదన్నారు. గ్రామాల్లో సర్పంచ్లు లేక ఈ పండుగకు ప్రజలకు ఎంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఉన్న డబ్బులను పెట్టి పంచాయతీ సెక్రటరీలు అప్పుల పాలయ్యారని ఈ పండుగా రోజు కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరు చెరువుల వద్దకు వచ్చి ఘనంగా ఈ వేడుకలను జరుపుకుంటారన్నారు.. ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాల మధ్య ఈ పండుగను జరుపుకుంటారన్నారు.బతుకమ్మ పండుగ అంటేనే భిన్నత్వంలో ఏకత్వం అని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..**
**బంగారు బతుకమ్మ ఉయ్యాలో...**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రం లోని కోమటి చెరువు పై ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. గురువారం సాయంత్రం మహిళలు రకరకాల పూలతో బతుకమ్మలను అలంకరించి చౌరస్తా ల వద్ద బతుకమ్మ ఆట, పాటలతో అలరించారు. తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. సిద్దిపేట మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లో వైభవంగా బతుకమ్మ సంబరాలు జరిగాయి. అట పాటల అనంతరం బతుకమ్మలు నిమజ్జనం చేశారు.

**బతుకమ్మ సంబరాల్లో హరీశ్ రావు సతీమణి శ్రీనిత..**
సిద్దిపేటలో బతుకమ్మ పండగలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సతీమణి శ్రీనిత పాల్గొన్నారు. ఈ సందర్బంగా సద్దుల బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపారు. పూలను పూజించే పండుగ ప్రకృతి ని ప్రేమించే బతుకమ్మ ఇది తెలంగాణ సొంతం అన్నారు. ఇలాంటి గొప్ప పండగ ఎక్కడ ఉండదని, ఇదే మన ప్రత్యేక సంప్రదాయం అని పేర్కొన్నారు. ప్రతి ఒక ఆడపడుచు సంతోషంగా పండుగ జరుపుకోవాలన్నారు.



Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com


Read Share Follow janapadam @janapadam #janapadam